ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 11.11.2025 సమయం: 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. ప్రజాకవి, రాష్ట్ర గీతం రచయిత డాక్టర్ అందెశ్రీ అంత్యక్రియలు ఘట్ కేసర్ లో ప్రభుత్వ అధికారిక లాంఛనాలతో నిర్వహిస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సహ పలువురు ప్రముఖులు అంత్యక్రియలకు హాజరయ్యారు.
2. న్యూఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో నిన్న సాయంత్రం జరిగిన కారు పేలుడు తర్వాత పరిస్థితిని అంచనా వేయడానికి కేంద్ర హోం మంత్రి అమిత్ షా అధ్యక్షతన ఉన్నత స్థాయి భద్రతా సమీక్ష సమావేశం రాజధానిలో జరుగుతోంది.
3. రాష్ట్రంలో వరిధాన్యం, పత్తి, మొక్కజొన్న, సోయాచిక్కుడు పంట ఉత్పత్తుల కొనుగోళ్లను వేగవంతం చేయాలని రాష్ట్ర మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు.
4. జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నిక పోలింగ్ ప్రశాంతంగా కొనసాగుతోంది. ఉదయం 11 గంటల సమయం వరకు 20.76 శాతం పోలింగ్ నమోదయినట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు.

-----------------------------

**అంతిమయాత్ర**

ప్రజాకవి, రాష్ట్ర గీతం రచయిత డాక్టర్ అందెశ్రీ అంత్యక్రియలు ప్రభుత్వ అధికారిక లాంఛనాలతో కొద్ది సేపటి క్రితం నిర్వహిస్తున్నారు. ఘట్ కేసర్ లో జరుగుతున్న అందెశ్రీ అంత్యక్రియలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరయ్యారు. అందెశ్రీ పార్థీవ దేహానికి నివాళులు అర్పించి అంతిమ యాత్రలో పాల్గొన్నారు. అలాగే, డాక్టర్ అందెశ్రీ అంతిమయాత్రలో మంత్రులు జూపల్లి

కృష్ణారావు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మన్ కుమార్, సీతక్క, ప్రభుత్వ సలహాదారులు కేశవరావు, ప్రొఫెసర్ కోదండరాంతో సహా పలువురు కవులు, కళాకారులు, రచయితలు పాల్గొన్నారు. సికింద్రాబాద్ లోని లాలాపేట నుంచి మొదలైన అంతిమయాత్ర ఘట్ కేసర్ వరకు కొనసాగింది.

**డెస్క్**

------------------------------

**అమిత్ షా పేలుడు**

న్యూఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో నిన్న సాయంత్రం జరిగిన కారు పేలుడు తర్వాత పరిస్థితిని అంచనా వేయడానికి కేంద్ర హోం మంత్రి అమిత్ షా అధ్యక్షతన న్యూఢిల్లీలోని ఆయన నివాసంలో ఉన్నత స్థాయి భద్రతా సమీక్ష సమావేశం జరుగుతోంది. ఈ సమావేశంలో కేంద్ర హోం కార్యదర్శి, ఇంటలిజెన్స్ బ్యూరో డైరెక్టర్, ఢిల్లీ పోలీస్ కమిషనర్, జాతీయ దర్యాప్తు సంస్థ డైరెక్టర్ జనరల్ పాల్గొన్నారు. జమ్మూ కాశ్మీర్ పోలీస్ డైరెక్టర్ జనరల్ వర్చువల్‌గా ఈ సమావేశంలో పాల్గొన్నారు. సంఘటన జరిగిన వెంటనే అన్ని సున్నితమైన ప్రాంతాలలో భద్రతను కట్టుదిట్టం చేశారు. పేలుడుకు గల కారణాలు, పరిస్థితులను గుర్తించడానికి, సాధారణ స్థితిని పునరుద్ధరించడానికి దర్యాప్తు కొనసాగుతోంది. నిన్న జరిగిన కారు పేలుడులో 8 మంది మరణించగా, పలువురు గాయపడ్డారు. ఢిల్లీ పోలీసులు, NIA, NSG, ఫోరెన్సిక్స్ బృందాలు దర్యాప్తు ప్రారంభించాయని, పేలుడుకు ఖచ్చితమైన కారణాలు త్వరలో బయటపడతాయని అమిత్ షా అన్నారు.

**ఎస్ఎస్డీ**

---------------------

**కొనుగోళ్లు**

రాష్ట్రంలో వరిధాన్యం, పత్తి, మొక్కజొన్న, సోయాచిక్కుడు పంట ఉత్పత్తుల కొనుగోళ్లను వేగవంతం చేయాలని రాష్ట్ర పౌరసరఫరాలు, వ్యవసాయ శాఖల మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. రాష్ట్ర సచివాలయం నుంచి నిన్న

మంత్రులు జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రైతులకు సమయానికి చెల్లింపులు చేయడమే కాకుండా, నిల్వ సౌకర్యం, రవాణా సదుపాయాలు కల్పిస్తూ క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ప్రతికూల వాతావరణ పరిస్థితులను ఎదుర్కొనేందుకు అప్రమత్తంగా ఉండాలని, పంటలు నష్టపోకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

**డెస్క్**

-------------------------

**తుమ్మల**

రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థ ఆయిల్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఉత్పత్తవుతున్న విజయ నూనెల అమ్మకాలు పెరగాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. వినూత్న మార్కెటింగ్ వ్యూహాలతో వినియోగదారుల ఆదరణ పొందాలన్నారు. హైదరాబాద్‌లోని విజయ నూనెల తయారీ, నిల్వల కేంద్రాన్ని నిన్న మంత్రి తనిఖీ చేశారు.

**పీఎస్**

-------------------------

**రికార్డు**

ధాన్యం కొనుగోళ్లలో తెలంగాణ కొత్త మైలురాయిని అధిగమించిందని పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ఈ సీజన్‌లో ఇప్పటివరకు 8లక్షల 54వేల టన్నుల కొనుగోళ్లు పూర్తయ్యాయన్నారు. గత యేడాదితో పోల్చుకుంటే ఇది రెండింతలు ఎక్కువ అని మంత్రి చెప్పారు. సన్నాల బోనస్ మొత్తం గత ఏడాది 43 కోట్ల రూపాయలు ఉండగా.. ఈ సంవత్సరం 197 కోట్ల పైచిలుకు పెరిగిందన్నారు.

**పీఎస్**

-------------------------

జూబ్లీ హిల్స్:

జూబ్లీహిల్స్ శాసనసభ నియోజకవర్గంలో పోలింగు, గట్టి భద్రత ఏర్పాట్ల మధ్య, ప్రశాంతంగా కొనసాగుతోంది. కడపటి సమాచారం అందేసరికి 31 శాతంపైగా పోలింగు నమోదైంది. పోలింగు సాయంత్రం 6 గంటలవరకు కొనసాగుతుంది. 6 గంటలకు వరుసలో ఉన్న అందరికీ ఓటు వేసే అవకాశం కల్పించనున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి RV కర్ణన్ చెప్పారు. లక్షా 92 వేల మంది మహిళలు సహా 4 లక్షల మంది పైగా ఓటర్లు 407 పోలింగూ కేంద్రాలలో ఓటు హక్కు వినియోగించుకోనున్నారు.

కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ కుమార్ యాదవ్ యూసఫ్ గూడ పోలింగ్ కేంద్రంలో కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కు వినియోగించుకోగా, బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత ఎల్లారెడ్డిగూడా నవోదయ కాలనీలో ఓటు వేశారు. బీజేపీ అభ్యర్థి లెంకల దీపక్ రెడ్డి కూడా తొలి కొద్ది గంటల్లోనే తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఉపఎన్నికలో మొత్తం 58 మంది అభ్యర్థులు పోటీ పడుతూండగా, ప్రధాన పార్టీల అభ్యర్థుల మధ్యే పోటీ నెలకొంది.

**MSL**

---------------------------

**కిసాస్ సమ్మాన్**

ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకం ద్వారా వచ్చే డబ్బులు, తనకు పంట ఎరువులకు, వ్యవసాయ కూలీలకు ఉపయోగపడ్డాయని, రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రూరల్ మండలం చెక్కపల్లి గ్రామానికి చెందిన లబ్ధిదారు కొండవేని హన్మాండ్లు చెప్పారు. ఆకాశవాణితో ఆయన మాట్లాడుతూ......

**బైట్ - హన్మాండ్లు**

**పీటీసీ - సిరిసిల్ల**

----------------------

**బ్రిడ్జి**

సికింద్రాబాద్–బల్లార్షా రైలు మార్గంలోని మంచిర్యాలలో ఫుట్ ఓవర్ బ్రిడ్జ్ ఏర్పాటుకు కేంద్ర రైల్వేశాఖ ఉత్తర్వులు జారీ చేసిందని పెద్దపల్లి పార్లమెంటు సభ్యులు గడ్డం వంశీ కృష్ణ తెలిపారు.

మూడు రైల్వే లైన్లు ఉండడం, ట్రాక్ దాటుతూ స్థానికులు ప్రమాదాల బారిన పడుతుండటంతో రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్, దక్షిణ మధ్య రైల్వే జీఎం సంజయ్ కుమార్ శ్రీవాస్తవను కలిసి తాను విజ్ఞప్తి చేయడంతో ఈ బ్రిడ్జి మంజూరైందని ఎంపీ వెల్లడించారు.

**సౌండ్ బైట్...ఎంపీ వంశీ కృష్ణ...**

**పీటీసీ - మంచిర్యాల**

---------------------------

**అగ్నివీర్**

హన్మకొండలోని జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో జరుగుతున్న అగ్నివీర్ రిక్రూట్మెంట్ ర్యాలీలో ఈరోజు నిజామాబాద్, మెదక్, సంగారెడ్డి, రంగారెడ్డి జిల్లాల అభ్యర్థులకు పోటీలు, మెడికల్ టెస్టులు నిర్వహిస్తున్నారు. నిన్న ఆదిలాబాద్, వనపర్తి జిల్లాలకు చెందిన 624 మంది ఫిజికల్ టెస్టులకు హాజరయ్యారు. ఇండియన్ ఆర్మీలో పని చేయడం దేశానికి గర్వకారణమని చెబుతున్న మహబూబాబాద్ జిల్లాకు చెందిన శ్రీరామ్ ఆకాశవాణి తో మాట్లాడుతూ...

**సౌండ్ బైట్.. శ్రీరామ్ ( అభ్యర్థి)**

**పీటీసీ - వరంగల్**

-------------------------

**స్మృత్యంజలి**

మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలు ఈ రోజు దేశ వ్యాప్తంగా జరుపుకుంటున్నారు. స్వతంత్ర భారత దేశ తొలి విద్యా శాఖ మంత్రిగా పని చేసి దేశ విద్యా రంగానికి పునాదులు వేసిన ఘనత మౌలానా అబుల్ కలాం ఆజాద్ కే దక్కుతుందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి కొనియాడారు. అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా జాతీయ విద్యా దినోత్సవం, మైనారిటీ సంక్షేమ దినోత్సవం జరుపుకుంటున్న వేళ.. విద్యారంగ ప్రగతికి ఆజాద్ చేసిన సేవలను ముఖ్యమంత్రి స్మరించుకున్నారు.

**పీఎస్**

----------------------------

**జాతీయ విద్యా దినోత్సవం**

మంచిర్యాలను అక్షరాస్యత జిల్లాగా తీర్చిదిద్దాలని జిల్లా అదనపు కలెక్టర్ పి. చంద్రయ్య అన్నారు. జాతీయ విద్యా దినోత్సవం సందర్భంగా భీమారం మండలంలో అమ్మకు అక్షరమాల కార్యక్రమంలో జిల్లా వయోజన విద్యాశాఖ అధికారి పురుషోత్తం నాయక్ తో కలిసి పాల్గొన్నారు. నిరక్షరాస్యులకు చదువు నేర్పించేందుకు వాలంటీర్లను గుర్తించి ఉల్లాస్ యాప్ లో నమోదు చేశామన్నారు.

**పీటీసీ - మంచిర్యాల**

------------------------

**వేడుకలు**

తొలి విద్యా శాఖ మంత్రిగా పనిచేసిన మౌలానా అబుల్ కలాం ఆజాద్ దేశ విద్యా రంగానికి బలమైన పునాదులు వేశారని వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. మౌలానా జయంతి సందర్భంగా జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ శాస్త్ర, సాంకేతిక విద్యా రంగాల అభివృద్ధికి ఆయన చేసిన కృషి మరువలేనిదన్నారు.

**పీటీసీ - వనపర్తి**

----------------------

**మౌలానా**

దేశ మొదటి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా రాజన్న సిరిసిల్ల జిల్లాలో జాతీయ విద్యాదినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గరీమ అగర్వాల్ మాట్లాడుతూ..మౌలానా జీవితాన్ని అందరూ ఆదర్శంగా తీసుకోవాలని, ఆయన ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు.

**పీటీసీ - సిరిసిల్ల**

--------------------------------